సాక్షి
అనకాపల్లి

బుధవారం । 30 । జూలై । 2025



గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

మురళీనగర్: కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది.



అప్పన్నకు విరాళం

సింహాచలం: సింహాద్రి అప్పన్న చందన సమర్పణకు ఎండాడకు చెందిన ఆళ్ల వెంకట రామకృష్ణ దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజుల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, జిల్లాలో తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.7 నుంచి 36.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 27.2 నుంచి 27.9 డిగ్రీలు ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

వినియోగదారుల పిల్లల కోటాలో 93 సీట్లు భర్తీ

- ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్
- ఇంకా మిగిలి ఉన్న సీట్లు 27



కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్

కశింకోట: ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల పిల్లల కోటా కింద 50 శాతం సీట్ల భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 93 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 27 సీట్లు మిగిలాయి. అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, జనరల్ సెక్షన్ విభాగాధిపతి కె.గోవిందరావు, కెమిస్ట్రీ సీనియర్ లెక్చరల్ శ్రీనివాసరావు అడ్మిషన్ అధికారులుగా హాజరై కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. కళాశాలలో నాలుగు బ్రాంచ్‌లుండగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. సివిల్ బ్రాంచ్‌లో అధికంగా 20 సీట్లు, మెకానికల్ బ్రాంచ్‌లో 7 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను ఆగస్టు 2వ తేదీలోగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్ తెలిపారు. ర్యాంకు లేని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. వార్షిక ఫీజులు వారే చెల్లించుకోవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపాల్ శివ, జనరల్ విభాగాధిపతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో దళారుల రాజ్యం
8లో

బుచ్చెయ్యపేట మండలంలో కేపీ అగ్రహారానికి చెందిన గోపిశెట్టి శ్రీను రైతు సేవా కేంద్రంలో ఆర్‌జేఎల్ 2537 రకం వరి విత్తనాలను మూడు బస్తాలు కొనుగోలు చేశారు. దమ్ము చేసి వరి నారు వేశారు. విత్తనాలు వేసి 18 రోజులైనా సరిగ్గా నాటలేదు. మూడు బస్తాల విత్తనాలు వేస్తే.. ఒక బస్తాకి తగ్గ నారు పలుచగా నాటింది. నాసిరకం విత్తనాలని గ్రహించి లబోదిబోమన్నారు. చివరకు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసుకున్నారు.

నాతవరం మండలం ఎస్‌జీ పట్నం గ్రామానికి చెందిన గాడి గణేష్ రెండు వారాల క్రితం రైతు సేవా కేంద్రంలో 1,262 రకం వరి విత్తనాలు నాలుగు బస్తాలు తీసుకున్నారు. అందులో కేళీ ధాన్యం ఎక్కువగా ఉన్నాయి. 30 శాతానికి పైగా కేళి ఉండడంతో ఆ మూడు బస్తాల నుంచి పొల్లుగా ఉన్న విత్తనాలను వేరు చేసి నారు వేశారు. దీంతో మూడు బస్తాలు కాస్త రెండు బస్తాలయ్యాయి. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తే సరిచేస్తామని చెబుతున్నారు.

ఈ ఏడాది త్వరగా వర్షాలు కురవడంతో మాడుగుల మండలం గాదిరాయికి చెందిన పర్రే రామునాయుడు దుక్కులు చేసుకుని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలు తీసుకున్నారు. కానీ వాటిలో 40 శాతం మాత్రమే నాటడంతో రెండుసార్లు వరి నారు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. మొదటిసారి వేసిన వరి విత్తనాలు నాటకపోవడంతో వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెండోసారి ఇచ్చిన వరి విత్తనాలతో ఇప్పుడిప్పుడే మొలకలు వస్తున్నాయి.

నాసిరకం.. నష్టభయం

- రైతు సేవా కేంద్రాల్లో నాసిరకమైన విత్తనాలు
- 15 రోజులైనా మొలకెత్తకపోవడంతో అన్నదాతల ఆవేదన
- విత్తనాల్లో పొల్లు, కేళీలు.. సగానికి పైగా వృథా
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు

సాక్షి, అనకాపల్లి: ఒకరు కాదు..ఇద్దరు కాదు చాలా మంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు తీసుకుని వరి నారు నాటకపోవడంతో మోసపోతున్నారు. ప్రభుత్వం వీటిపై శ్రద్ధ చూపించకపోవడం తోనే ఇలా జరుగుతోందంటూ రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగా రావడంతో అన్నదాతలు ఆనందపడ్డారు. రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు తీసుకుని నారు మడులు సిద్ధం చేశారు. వరి విత్తనాలు వేశారు. అయితే వర్షాలు అనుకూలించినా సరే నాణ్యమైన విత్తనాలు రాకపోవడంతో అవి మొలకలు రాక ఖరీఫ్ కష్టాలు ఆదిలోనే ప్రారంభమయ్యాయి. రైతు సేవా కేంద్రంలో విక్రయించే వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరీక్షించకుండా నేరుగా రైతులకు విక్రయించారు. ఇప్పటికే వర్షాలు సరిగా లేక వరి ఆకుపోతలు ఆలస్యమయ్యాయి. ఇపుడు నాసిరకం వరి విత్తనాల కారణంగా వరినారు నాటకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. రైతుకు నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన వారిపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారంలో సరిగా మొలకెత్తని గోపిశెట్టి శ్రీను ఆకుమడి



మాడుగుల గాదిరాయిలో అరకొరగా నాటిన వరి నారు

జిల్లాలో విత్తనాల వివరాలు ఇలా..

సిద్ధం చేసిన మొత్తం విత్తనాలు	అందులో వరి విత్తనాలు	ఇప్పటి వరకు పంపిణీ చేసినవి
23 వేల క్వింటాళ్లు	22 వేల క్వింటాళ్లు	సుమారు 16.5 వేలు

కూటమి ప్రభుత్వంలో అగ్రి ల్యాబ్స్ నిర్వీర్యం

విత్తనం మంచిదైతే పంట బావుంటుంది. పంట బావుంటే దిగుబడిపై దిగులుండదు. ఆశించిన దిగుబడులు సాధించాలంటే మేలి రకం విత్తనం కావాలి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రి ల్యాబ్స్‌ను తీసుకొచ్చింది. నాసిరకం, పొల్లు, కేళీ లేకుండా విత్తనాలు అగ్రి ల్యాబ్‌లో పరీక్షించి నాణ్యమైన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లను నిర్వీర్యం చేసింది. దీంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు.



ఆర్‌జేఎల్ రకం వరి ధాన్యం గోనెలు

బాగులేకపోతే మారుస్తున్నాం

రైతు సేవా కేంద్రాల్లో నాణ్యమైన వరి విత్తనాలనే పంపిణీ చేస్తున్నాం. ఎక్కడైనా విత్తనాలు బాగులేవని చెబితే వెంటనే మార్చేస్తున్నాం. ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడా ఇలాంటి సమస్యలు రాలేదు. భూసారం, జింకు లోపం వంటి కారణాలతో కూడా నాటకపోవడం జరుగుతుంది. భూసార పరీక్షలు చేయించుకుంటే స్పష్టత వస్తుంది.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తులపై ఫిర్యాదు



తాతయ్యబాబుపై పల్లాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే రాజు వర్గ సభ్యులు

బుచ్చెయ్యపేట: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుపై చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు వర్గీయులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే తాతయ్యబాబు, ఎమ్మెల్యే రాజు మధ్యన గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఇందులో భాగంగానే బుచ్చెయ్యపేట మండలంలో ఆ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకరు నిర్వహించే కార్యక్రమాల్లో మరొకరు పాల్గొనడం లేదు. ఇదే విషయమై తాతయ్యబాబు గుర్రుగా ఉన్నారు. జిల్లా అధ్యక్షుడిగా హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే రాజు తీరుపై బాహాటంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాజు గ్రూపు రాజకీయాలు చేస్తున్నట్లు టీడీపీ పొలిట్ బ్యూరోకి ఫిర్యాదు వెళ్లింది. కొన్నాళ్లుగా వీరిద్దరి మధ్య నడుస్తున్న రాజకీయ వైరం వల్ల తాజాగా మండలంలో వడ్డాది, బుచ్చెయ్యపేట, తురకలపూడి, విజయరామరాజుపేట, పొట్టిదొరపాలెం, బంగారుమెట్ట ఆరు కోఆపరేటివ్ సొసైటీల పర్సన్ ఇన్‌చార్జుల నియామకాలు నిలిచిపోయాయి. దీనిపై ఎమ్మెల్యే రాజు వర్గానికి చెందిన కొంతమంది నాయకులు మంగళవారం గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిశారు. తాతయ్యబాబే గ్రూపు రాజకీయాలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.

గోతుల రోడ్లు కనిపించడం లేదా?

- వాటిపై తిరగండి ప్రజల కష్టాలు తెలుస్తాయి
- పారిశుధ్యం మెరుగుపర్చకపోతే చర్యలు తప్పవు
- ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులపై కలెక్టర్ విజయ కృష్ణన్ ఆగ్రహం
- వడ్డాది, ముకుందపురం గ్రామాల్లో సుడిగాలి పర్యటన



వడ్డాదిలో సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు



ముకుందపురంలో డ్రైనేజీలు పరిశీలిస్తున్న కలెక్టరు విజయ కృష్ణన్

బుచ్చెయ్యపేట/మాడుగుల రూరల్: 'గోతుల రోడ్లు మీకు కనిపించడం లేదా? రెండు రోజులు వాటిపై తిరగండి ప్రజల కష్టాలు తెలుస్తాయి' అంటూ కలెక్టర్ విజయ కృష్ణన్ ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో పారిశుధ్య పనులు పరిశీలించి అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజలు రోడ్డెక్కి రహదారి బాగు చేయాలని గోల చేస్తున్నారు, నిధులున్నా ఎందుకు పనులు చేయడం లేదని ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు, డీఈ విద్యాసాగర్, సబ్ కాంట్రాక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వడ్డాదిలో పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంపై ఎంపీడీవో భానోజీరావు, మండల పంచాయతీ అధికారి విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల వివరాలు సచివాలయ సిబ్బందిని అడగ్గా నీళ్లు నమిలారు. డేటా లేకుండా సమావేశానికి ఎందుకొచ్చారని, ప్రజల పనులంటే చులకనగా ఉందా అంటూ మండిపడ్డారు. వారం రోజుల్లో మరలా వస్తాను, సంక్రమంగా విధులు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వడ్డాదిలో తాగు నీటిపైన, విశాఖ డెయిరీ పాలకేంద్రం వద్ద కలుషిత నీరు వదిలేయడంపైన, డ్రైనేజీలు సరిగా తీయకపోవడంపైన, నకిలీ విత్తనాలు అమ్మకంపై స్థానికులు దొండా నారాయణమూర్తి, బొబ్బాది రాజు, దొండా రమేష్, కోరుకొండ రమణ, సోమేష్ తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులకు సూచించి పనులు పరిశీలించాలని ఆదేశించారు.

వారం రోజుల్లో మళ్లీ వస్తా...

మాడుగుల మండలం ముకుందపురంలో ఐదు రోజుల్లో పారిశుధ్యం మెరుగుపర్చకపోతే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం ఆమె అధికారులతో కలిసి ఇక్కడ పారిశుధ్య పనులు పరిశీలించారు. వారం రోజుల్లో మరలా గ్రామాన్ని సందర్శిస్తానని పారిశుధ్యం మెరుగుపర్చకపోతే కార్యదర్శి, ఇతర సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక మహిళలుతో మాట్లాడారు. డ్రైనేజీల్లో చెత్తా చెదరాలు వేయొద్దని, పరిసరాలు పరిశుభ్రతతో రోగాలు దరి చేరవని సూచించారు.

భూ సమస్య గురించి సర్పంచ్ కర్రి గణేష్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో ఇ. సందీప్, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఇ. నాగలక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో అప్పారావు, తహసీల్దార్లు లక్ష్మి, రమాదేవి, ఏపీవో వరహాలబాబు, ఏవోలు భాస్కరరావు, ఎం. అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక నామినేషన్ల ఘట్టం మంగళవారంతో ముగిసింది. వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది, కూటమిలోని టీడీపీ నుంచి 9 మంది, బీజేపీ నుంచి ఒకరు, జనసేన నుంచి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను పరిశీలిస్తారు. ఆగస్టు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 6వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.

ఖరీఫ్ సాగుకు రైవాడ నీరు విడుదల

దేవరాపల్లి: ఖరీఫ్ పంటల కోసం రైవాడ జలాశయం నుంచి సాగునీటిని మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్. రాజు మంగళవారం విడుదల చేశారు. ముందుగా రైవాడ అతిథి గృహం వద్ద వినాయకుడికి, జలాశయం వద్ద ఎరకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జలాశయం వద్ద వేదమంత్రాల నడుమ పూజలు, గంగా హారతి అనంతరం నీటిని విడుదల చేశారు. ఈ మేరకు ఎడమ ప్రధాన కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు. కార్యక్రమంలో రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, పైలా ప్రసాదరావు, ఇరిగేషన్ ఈఈ త్రినాథం, డీఈఈ జి. సత్యంనాయుడు, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



రైవాడ నీటిని విడుదల చేస్తున్న మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు, కె.ఎస్.ఎన్.ఎస్. రాజు

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి
కలెక్టర్ విజయ కృష్ణన్ 8లో

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బూడి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధ

దేవరాపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ముత్యాలనాయుడు పాల్గొన్నారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఈర్లె అనురాధతో కలిసి ఆయన ప్రత్యేకంగా కలిశారు.

ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను అడ్డగించిన స్పీకర్



అధిక లోడ్‌తో ఉన్న లారీలు

నర్సీపట్నం: ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా ఆపి పోలీసులకు అప్పగించారు. మంగళవారం స్పీకర్ విశాఖ నుంచి నర్సీపట్నం వస్తుండగా.. మాకవరపాలెం మండలం, రాజుపేట వద్దకు వచ్చే సరికి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను గమనించారు. లారీలను నిలిపి.. అధిక లోడ్‌కు ఎవరు పర్మిషన్ ఇచ్చారని వాహనదారులను నిలదీశారు. ఆ లారీలను పోలీసు స్టేషన్‌లో పెట్టాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారు. స్పీకర్ ఆదేశాలతో ఎస్సై దామోదర్‌నాయుడు ఏడు లారీలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పేకాడుతున్న ముగ్గురు అరెస్ట్

- రూ.5.11 లక్షలు స్వాధీనం

అనకాపల్లి టౌన్: పట్టణ శివారు తోటాడ వెళ్లే రహదారిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.5,11,620 స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ టి.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన పోలంకి సూకరాజు, నాతవరం మండలానికి చెందిన ముత్తా నాగు, కేడీ పేటకు చెందిన మెండెం నానాజీ మరికొంత మంది పేకాట ఆడుతున్నారని తెలిపారు. వీరిలో ముగ్గురు మినహా మిగిలిన వారందరూ పారిపోయారని తెలిపారు. అలాగే స్థల నిర్వాహకుడిని గుర్తించామని, పారిపోయిన వారిని కూడా గుర్తించి అరెస్ట్ చేస్తామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- ‘ఉల్లాస్ అక్షరాంధ్ర’ లక్ష్యం సంపూర్ణ అక్షరాస్యతే
- జిల్లాలో 2,85,398 మంది వయోజన నిరక్షరాస్యులు
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ఉల్లాస్ అక్షరాంధ్ర’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వయోజన విద్యాశాఖ, పారిశ్రామిక అభివృద్ధిపై వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ–2023 సర్వే ప్రకారం జిల్లాలో 2,85,398 మంది వయోజనులను నిరక్షరాస్యులుగా గుర్తించామన్నారు. మొదటి విడతగా ఈ ఏడాది 89,944 మందిని తీసుకుని అక్షరాస్యులుగా చేయడానికి ప్రణాళిక రుపొందించాలని డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా అధికారులను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో మొత్తం 2,85,398 మందిని కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి జిల్లాను తీసుకురావాలని చెప్పారు. గత సంవత్సరం 24 మండలాల్లో నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తయారు చేశామన్నారు.

- మండల, గ్రామ స్థాయిలో వాలంటరీ టీచర్స్‌ను పది మంది చొప్పున కేటాయించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సంక్షేమ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే ఆరు నెలల కాలంలో రోజూ సాయంత్రం 5 నుంచి 6.30 గంటల మధ్యలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆగస్టు నుంచి 2026 ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు నిర్వహించాలన్నారు.



వయోజన విద్యపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు

జిల్లా పారిశ్రామిక అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) 15వ జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏకగవాక్ష విధానం కింద గత మే 26న జరిగిన సమావేశం నుంచి ఇప్పటి వరకు 685 దరఖాస్తులు వివిధ శాఖల అనుమతి కోసం రాగా.. వాటిలో 615 దరఖాస్తులకు ఆమోదం తెలిపామన్నారు. పెండింగ్ దరఖాస్తుల అనుమతులపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడాలన్నారు. జిల్లాలో 14 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం 37 దరఖాస్తులకు గాను రూ.5.92 కోట్లకు కమిటీలో ఆమోదం తెలిపామన్నారు. జిల్లాలో 43 భారీ పరిశ్రమల స్థాపనకై ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉండగా, వీటి ద్వారా రూ.2,81,760 కోట్ల పెట్టుబడితో పాటు 1,46,673 మందికి ఉపాధి కల్పనకు అవకాశాలు ఉన్నాయన్నారు.

- 2024 అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 196 పరిశ్రమలకు గాను 176 పరిశ్రమలను తనిఖీలు చేశామని కలెక్టర్ వివరించారు. తనిఖీలలో వివిధ శాఖల అధికారులు ఆ పరిశ్రమలకు 485 పనితీరు మెరుగుదల సూచనలు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా ఉప సంచాలకుడు ఎస్.ఎస్.వర్మ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.కె.పి.ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం నరసింహారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా సమన్వయ అధికారి చిన్ని కృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నారాయణమూర్తి, డీఈవో జి.అప్పారావునాయుడు, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు శచిదేవి, పూర్ణిమ దేవి, ఎస్.సరోజినీ, సూర్యకుమారి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విదార్థులకు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో డిజిటల్ క్లాస్ రూంల వినియోగం పెరగాలని, ఉపాధ్యాయుల ఈ–హాజరు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి.అప్పారావునాయుడు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, 24 మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో దళారుల రాజ్యం



రెవెన్యూ శాఖలో బ్రోకర్ల హవాపై సమావేశంలో నిలదీస్తున్న సభ్యులు

- ఏజెంట్ల ద్వారానే పనులు
- అవినీతికి అడ్డాగా తహసీల్దార్ కార్యాలయాలు
- నక్కపల్లి మండల సమావేశంలో కూటమి ఎంపీటీసీలు ధ్వజం

నక్కపల్లి: రెవెన్యూ శాఖ పనితీరుపై కూటమి పార్టీలకు చెందిన ఎంపీటీసీలు ఆరోపణలు గుప్పించారు. బ్రోకర్ల ద్వారానే పనులు జరుగుతున్నాయని, తహసీల్దార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయంటూ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీకి చెందిన కాగిత ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, టీడీపీకి చెందిన డీఎల్ పురం ఎంపీటీసీ కొండ్ర కనకారావు తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా బ్రోకర్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. సాయంత్రం అయ్యేటప్పటికీ తహసీల్దార్ కార్యాలయం బ్రోకర్లతో నిండిపోతోందన్నారు. అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులే తమ ప్రభుత్వంలో కీలకమైన రెవెన్యూ శాఖపై ఆరోపణాస్త్రాలు సంధించడంతో మిగిలిన ప్రతిపక్ష సభ్యులు విస్తుపోయారు. కీలకమైన రెవెన్యూ శాఖ పని తీరు ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏంటంటూ నిలదీశారు. తక్షణమే రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలన్నారు. అనధికార వ్యక్తులు కార్యాలయాల్లో తిష్టవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదని, సచివాలయాలకు వెళ్తే తాము తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్నామని సమాధానం చెబుతున్నారన్నారు. అక్కడకు వెళ్లినా కనిపించడం లేదన్నారు. ఈ అంశాలపై మండల సమావేశంలో తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించాలని డిమాండ్ చేశారు.

వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. కాగితలో 15 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ ఫిర్యాదు చేశారు. ఉద్దండపురంలో చెత్తను వేసేందుకు స్థలం కొరత ఉందని, డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ వెంకటేష్ కోరారు. ప్రతి సమావేశానికి మండల స్థాయి అధికారులు రావడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వేంపాడు ఎంపీటీసీ కుంచ మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలను తీర్మానం చేసి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపీపీ రత్నం తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్త పెను సమస్య

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

బీచ్‌రోడ్డు(విశాఖ): మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా పెను సమస్యగా మారుతోందని, ఇది చాలా విచారకరమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, ఏటీఎస్ఏసీ ఇండియా సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ సీఐడీ, పలు సంస్థల సమన్వయంతో రూపొందించిన ‘మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరం – ఈ దోపిడీని అంతం చేయండి’ పోస్టర్‌ను మంగళవారం సిరిపురంలోని జెడ్పీ చైర్మన్ క్యాంప్ ఆఫీసులో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు, పేదవారు, నిరక్షరాస్యులు బాధితులుగా మారుతుండటం బాధాకరమన్నారు. చక్కని జీవితం, ఉద్యోగం, పెళ్లి పేరుతో నమ్మించి..వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాతో పాటు బాలికల అక్రమ రవాణా వ్యవస్థను రూపుమాపేందుకు తమ ఫోరం ప్రభుత్వంలోని వివిధ శాఖలతో పాటు ఈ అంశంపై పోరాటాలు చేస్తున్న రాష్ట్రంలోని 16 ప్రభుత్వేతర (ఎన్‌జీఓ) సంస్థలతో కలిసి పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధులు కె. ఎల్లయ్య, బి. లవకుశ, ఎం. ప్రవీణా త్రినాథ్, బి. లక్ష్మణరావు, బొడ్డేపల్లి సురేష్, ఎం. హరీష్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన ప్రభాకర్

గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. చోద్యం గ్రామానికి చెందిన పైల ప్రభాకర్(33) నర్సీపట్నం నుంచి చోద్యంకు రాత్రి 11 గంటల సమయంలో బైక్‌పై వెళ్తుండగా పప్పుశెట్టిపాలెం మలుపు వద్ద కుక్కను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ఘటనలో ప్రభాకర్ తలకు బలమైన గాయం కావడంతో ఆ సమయంలో అటుగా వెళుతున్న కొంత మంది 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి క్షతగాత్రుడిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించే ప్రయత్నంలో ఏరియా ఆస్పత్రిలోనే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొలుగొండ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరాలతో మరణిస్తున్నా పట్టించుకోరా..!

- గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- నాతవరం పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యులను నియమించాలి
- సీపీఐ మండల కార్యదర్శి చిన్నయ్యనాయుడు



నాతవరం: గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతూ మరణిస్తున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని మండల సీపీఐ కార్యదర్శి అంకంరెడ్డి చిన్నయ్యనాయుడు అన్నారు. ఆయన మండలంలో మంగళవారం పి.జగ్గంపేట, కొండధర్మవరం పి.కె.గూడెం, గునుపూడి నాతవరం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు, అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో జ్వరాలు నియంత్రించాలంటే స్పీకరు అయ్యన్నపాత్రుడు దృష్టి సారించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మూడు నెలలుగా మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో జ్వరాలతో ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. ఇటీవల పి.జగ్గంపేట గ్రామంలో ఇద్దరు వ్యక్తులు జ్వరాలతో బాధపడుతూ మరణించారన్నారు. మరో ముగ్గురు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మండలం అంతా జ్వరాలతో అల్లాడిపోతుంటే నాతవరం పీహెచ్‌సీలో వైద్యులు లేరన్నారు. గతంలో ఇక్కడ పనిచేసే ఇద్దరు వైద్యులు వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయారన్నారు. పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యులను నియమించి గ్రామాల్లో యుద్ధప్రతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో పరిస్థితులపై మా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై ఆందోళన చేస్తామన్నారు.

దళిత రైతుల ఆందోళన స్పీకర్‌కు పట్టదా?



క్వారీని పరిశీలిస్తున్న ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ పరంజ్యోతి

నర్సీపట్నం: రాళ్ల క్వారీని రద్దు చేయాలని ఆర్డీవో కార్యాలయం వద్ద మాకవరపాలెం మండలం జి.కోడూరు, సుభద్రయ్యపాలెం దళిత రైతులు చేస్తున్న నిరాహార దీక్ష మంగళవారానికి ఏడో రోజుకు చేరింది. ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.పరంజ్యోతి విచ్చేసి దళిత రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా నియోజకవర్గ ఎమ్మెల్యే, స్పీకర్ సిహెచ్.అయ్యన్న పాత్రుడు, అధికారులకు పట్టదా? అని ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆందోళనలు చేయించి క్వారీని రద్దు చేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే కొత్తవారికి క్వారీ లీజుకివ్వడం దారుణమన్నారు. ఓట్లు వేసి గెలిపించిన బహుజన వర్గాలకు చెందిన భూములకు అన్యాయం జరుగుతుంటే కనీసం స్పీకర్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ క్వారీ అనుమతులు రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రశ్నిస్తే మైనింగ్ చేస్తున్న బంగార్రాజు బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బొట్టా నాగరాజు, ఐబీఎస్‌పీ రాష్ట్ర మహిళా కన్వీనర్ లక్ష్మి, జిల్లా మహిళా నాయకురాలు తులసి, కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, కేవీపీఎస్ నాయకులు చిరంజీవి, కొల్లు గంగాధర్, సూరిబాబు, అప్పారావు, పెంటయ్య, మారేసు, దేముడు, లోవరాజు, వంశీ, శివ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24 కిలోల గంజాయి పట్టివేత

నక్కపల్లి: మండలంలో సారిపల్లిపాలెం సమీపంలో మంగళవారం పోలీసులు 24 కిలోల గంజాయిని పట్టుకున్నారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్ఐ సన్నిబాబు సారిపల్లిపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అనకాపల్లి నుంచి తుని వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై రెండు కాలేజీ బ్యాగులను పట్టుకుని వ్యక్తి రావడాన్ని గుర్తించారు. తనిఖీ చేయగా.. ఆయన వద్ద 24 కేజీల గంజాయి బయట పడిందని డీఎస్పీ తెలిపారు. చింతపల్లి మండలం మామిడిపాలెం గ్రామానికి చెందిన సుక్రి అర్జున్, ఇతని స్నేహితుడు రోలుగుంట మండలం పెద్దపేట గ్రామానికి చెందిన కొదమ నాగరాజుతో కలసి గంజాయి వ్యాపారం చేస్తున్నారన్నారు. వీరికి గొలుగొండ మండలం కోడులపాలెం గ్రామానికి చెందిన గంజాయి వ్యాపారి రెడ్డి నర్సింహమూర్తితో పరిచయం ఏర్పడిందని చెప్పారు. నర్సింహమూర్తికి అర్జున్ గతంలో ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయించేవాడన్నారు. తాజాగా నర్సింహమూర్తి ఈయనకు ఫోన్‌చేసి గంజాయి కావాలని, తుని హైవే రోడ్డులో అప్పగించాలని కోరడంతో రైతుల వద్ద కొనుగోలు చేసిన 24 కిలోల గంజాయిని 12 ప్యాకెట్లలో సిద్ధం చేసి తునిలో అప్పగించేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో అర్జున్ అంగీకరించాడన్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న వారిపై విచారణ జరుగుతోందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అర్జున్‌పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఈ ఏడాది నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సారిపల్లిపాలెం వద్ద పట్టుబడిన 840 కిలోల గంజాయి రవాణాకు సంబంధించి కేసులో అర్జున్ ప్రధాన నిందితుడని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడ్డ గంజాయి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గంజాయి కేసులో పాత నిందితుడు అరెస్టు

చోడవరం: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని చోడవరం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. 2016లో పెదబయలు మండలం బల్లపురాయి గ్రామానికి చెందిన వంతల వెంకటరావు గంజాయి అక్రమంగా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకోగా.. ఆ సమయంలో తప్పించుకొని పరారయ్యాడని ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. తాజాగా చోడవరం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటరావు పట్టుబడ్డాడని చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

స్పెషల్ ఒలింపిక్ క్రీడా పోటీల్లో ప్రతిభ

రావికమతం: జాతీయ స్థాయి దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్ భారత్ బోసి బాల్ క్రీడా పోటీల్లో రావికమతం మండలం కేబీపీ అగ్రహారానికి చెందిన నక్కరాజు బాల సరస్వతి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. మానసిక విద్యార్థుల జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడా ఛాంపియన్‌షిప్ –2025 పోటీలు ఈ నెల 24 నుంచి 28 వరకూ చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి యూనివర్సిటీ స్టేడియంలో జరిగాయి. బోసి బాల్ గేమ్ పోటీల్లో దేశంలోని 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మేధో, నాడీ సంబంధిత వైకల్యం కలిగిన బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఏపీ రాష్ట్రం నుంచి ఆరుగురు బాలురు, బాలికలు పాల్గొనగా వారంతా పతకాలు సాధించారు. వారిలో రావికమతం మండలం కేపీబీ అగ్రహారానికి చెందిన బాల సరస్వతి ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించి బోసి బాల్ గేమ్ వ్యక్తిగత విభాగంలో నాలుగో స్థానంలో నిలిచింది. స్పెషల్ ఒలింపిక్ భారత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్, ఏరియా జనరల్ మేనేజర్ ప్రమోద్ తివారి, బిలాస్‌పూర్ అటల్ బీహారీ వాజ్‌పాయ్ యూనివర్సిటీ వైస్ చాన్సలార్ చేతుల మీదుగా బాల సరస్వతి పతకం మెరిట్ సర్టిఫికెట్‌ను అందుకుంది.

జాతీయ స్థాయిలో జరిగిన బోసి గేమ్‌లో ఏపీ రాష్ట్రం నుంచి పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులకు కోచ్‌గా రావికమతం మండలం మేడివాడ జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు కోచ్‌గా వ్యవహరించారు. బోసి బాల్ గేమ్ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నాలుగో స్థానంలో నిలిచిన బాల సరస్వతిని కోచ్ మహాలక్ష్మినాయుడును, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నాయుక్, సహిత విద్యా సమన్వయ అధికారి రామకృష్ణ నాయుడు మంగళవారం అభినందించారు.



విజేతలతో కోచ్ మహాలక్ష్మినాయుడు

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు మాజీ ఉద్యోగులకు ఏసీబీ నోటీసులు

అనకాపల్లి: అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో గుర్తించిన అవకతవకలకు సంబంధించి 10 రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఇద్దరు మాజీ ఉద్యోగులకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ షేక్ షకీలా బాను నేతృత్వంలోని అవినీతి నిరోధక శాఖ అధికారులు 2020 జనవరి 10వ తేదీన కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డు రూమ్‌లో అనధికారికంగా రూ.50 వేలు ఉన్నట్టు గుర్తించారు. అప్పటి రికార్డు అసిస్టెంట్ మైలపల్లి సముద్రం, సబ్ రిజిస్ట్రార్ ఎం.పురుషోత్తంలపై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో కార్యాలయం వద్ద ఉన్న పదిమంది డాక్యుమెంట్ రైటర్ల వద్ద నుంచి రూ.33,660లు సీజ్ చేసి ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్టు కేసులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మైలపల్లి సముద్రం ఈ ఏడాది మార్చి 31న, పురుషోత్తం ఈ ఏడాది జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు.

రుణ నిబంధనలు అతిక్రమించిన వ్యక్తిపై కేసు

నర్సీపట్నం : శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ బి.జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామానికి చెందిన గుడివాడ లోవరాజుపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. నిందితుడు లోవరాజు, మరికొంత మంది కలిసి ఈ ఏడాది జూన్‌లో రూ.1.25 కోట్లు విలువ చేసే హైడ్రాలిక్ ప్రొక్లెయిన్ మెషిన్‌ను లోన్-కమ్ హైపోథికేషన్ విధానంలో ఫైనాన్స్ తీసుకున్నారు. హైపోథికేషన్ నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ మొత్తం లభించాలనే దురుద్దేశంతో హైడ్రాలిక్ ప్రొక్లెయిన్ మెషిన్‌ను అక్రమంగా వేర్వేరు సంస్థల ద్వారా హైదరాబాద్ నుంచి ముంబయి పోర్టు మీదుగా విదేశాలకు తరలించారని సీఐ తెలిపారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామన్నారు.

రేపు నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు

నక్కపల్లి: మండలంలో విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ కోసం సేకరించిన భూముల్లో నివాస ప్రాంతాలు కోల్పోయిన వారికి గురువారం ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్టు ఆర్డీవో రమణ తెలిపారు. పునరావాసం కల్పించే ప్రక్రియలో భాగంగా కుటుంబ పెద్దలను, మేజర్ కుమారులను, అవివాహిత మేజర్ కుమార్తెలను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హులుగా 745 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. నక్కపల్లి మండలంలో బోదిగల్లం గ్రామంలో నిర్మించనున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఒక్కొక్కరికి 5 సెంట్ల విస్తీర్ణంతో కూడిన ప్లాట్లను కేటాయించడానికి లేఅవుట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ లేఅవుట్‌లో లబ్ధిదారుల సమక్షంలో 745 మందికి లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు కాగిత –పాటిమీద కొత్తరోడ్డు చివర చర్చి వద్ద లాటరీ తీసే ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

సొంత గూడు కరువు

- అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు
- అద్దె, పైకా భవనాల్లో తరగతుల నిర్వహణ
- 13 కేంద్రాలకు భవనాలు లేక ఇక్కట్లు
- అద్దె కొంపల్లో నడుస్తున్న 9 కేంద్రాలు



రేబాకలో పైకా భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

తుమ్మపాల: అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. గత ప్రభుత్వంలో మొదలు పెట్టిన భవనాలను పూర్తి చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో అసంపూర్తిగా నిలిచి పోయిన భవనాలు అధ్వానంగా మారాయి. మరి కొన్ని నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, నిర్మాణాలు పూర్తి చేయడంపై కనీసం దృష్టి సారించడం లేదు. అద్దె భవనాలు, ప్రభుత్వ



రేబాకలో పదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

పాఠశాలల్లో పైకా భవనాలు, అదనపు తరగతి గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. వాటిలో సరైన సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అసౌకర్యాల భవనాల కారణంగా తల్లిదండ్రులు పిల్లలను పంపించడం లేదు. దీంతో పిల్లల్లో పౌష్టికాహార లోపం గుర్తించి ముందస్తు అంచనా వేయడం కష్టమవుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లోను అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు 84



శంకరంలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం

కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణుల కోసం ప్రత్యేక వ్యవస్థ పనిచేస్తోంది. వాటి ద్వారానే పౌష్టికాహార ఉత్పత్తులైన పాలు, బాలామృతం, చెక్కీలు, వంటివి పంపిణీ చేస్తుంటారు. వీటి పూర్తి బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలే కావడంతో భవనాలు లేని చోట్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 22 అంగన్‌వాడీ కేంద్రాలకు నేటికీ శాశ్వత భవనాలు లేవు. వాటిలో 13 చోట్ల నూతన భవనాలకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నికల నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చి నిధులు నిలిపివేసింది. దీంతో వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. తొమ్మిది చోట్ల నేటికీ భవనాలు మంజూరు కాలేదు. వాటి స్థానంలో అద్దె భవనాల్లో నిర్వహణ చేస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలు

మండలంలో శంకరం, కుంచంగి–3, తగరంపూడి–2, కేటీవిపాలెం, చేనుల అగ్రహారం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు దాదాపు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కూటమి నాయకులు ప్రారంభించేందుకు సుముఖంగా లేరు. గత ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.12 లక్షలు మంజూరు చేసి పూర్తి చేసింది. మేజర్ పంచాయతీ తుమ్మపాల–3, రేబాక, గణేష్‌నగర్, వెంకటరమణయ్యపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు శ్లాబ్ సహ నిర్మాణం పూర్తయింది. తగరంపూడి–1, సంపతిపురం, భూపతిపాలెం , కొండుపాలెం, మెండుపాలెం గ్రామాల్లో నేటికీ పిల్లర్లకే పరిమితమై అసంపూర్తిగానే ఎదురు చూస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యా శాఖలోనే ఇలాంటి దుస్థితి నెలకొనడం వారి పనితీరుకు అద్దం పడుతోంది.

అసంపూర్తి పనులు తక్షణమే పూర్తి చేయాలి



చిన్నపిల్లల రక్షణ, పోషణ, నర్సరీ విద్యకు కేరాఫ్‌గా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు మండలంలో కొన్ని చోట్ల ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉండిపోయాయి. ప్రభుత్వాలు మారినంతమాత్రన వీటిపై రాజకీయం చేయడం సబబుగా లేదు. కూటమి పాలనలో అన్ని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తి చేయాలి. మరిన్ని సౌకర్యాలతో పిల్లలకు చక్కటి వసతులు అందించాలి. గత ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయి నిర్వహణకు సిద్ధంగా ఉన్న భవనాలకు రంగులు వేసి తక్షణమే ప్రారంభించాలి. – బాదపు హరికృష్ణ, ఉప సర్పంచ్, సుందరయ్యపేట గ్రామం

క్లుప్తంగా

ఇష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు



విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రైనింగ్ ఎస్‌ఐ పోషణ గౌరి

అనకాపల్లి: కష్టపడి చదువుకోవడం కంటే ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పట్టణ ట్రైనింగ్ ఎస్‌ఐ పోషణ గౌరి తెలిపారు. స్థానిక వేల్పులవీధిలోని టౌన్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ – బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుంచి పాఠశాలలకు బయలుదేరిన విద్యార్థులు పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. రహదారులపై ఆకతాయిలు ఎక్కడైనా ఇబ్బందులు పెట్టినట్లయితే దగ్గరలో పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలని వినతి



కశింకోట ఎంపీడీవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేత

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయని, వీటి నివారణకు చర్యలు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో వి.వి. రవికుమార్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా దళిత బహుజనులు నివసించే కాలనీల్లో ఊర కుక్కలు సంచారం ఎక్కువగా ఉందన్నారు. వీటి దాడుల వల్ల చిన్న పిల్లలు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక హౌసింగ్ కాలనీలో బాలుడ్ని కుక్క దాడి చేసి గాయపర్చిందన్నారు. దీని దృష్ట్యా వీధి కుక్కల బారి నుంచి బాలలను కాపాడటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



హాజరై దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: స్థానిక కోనేరు వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శ్రావణ పంచమి పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ అర్చకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పంచామృతాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 129 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,610	4,610
రెండో రకం	3,550	3,550
మూడోరకం	3,100	3,490

అనకాపల్లి సినిమాలు

రాజా	:ద ఫెంటాస్టిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	:హరి హర వీరమల్లు
పర్తిసాయి	:మహావతార్ నరసింహ
షిర్డీసాయి	:హరి హర వీరమల్లు
వెంకటేశ్వర	:హరి హర వీరమల్లు
శ్రీ సత్య	:తమ్ముడు
రామచంద్ర	:హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11, బీ పాజిటివ్–29, ఓ పాజిటివ్–40, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు పార్టీ నియోజకవర్గ శ్రేణులతో బాబు షూ్యరిటీ–మోసం గ్యారంటీపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ హాజరవుతారన్నారు. పార్టీ ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం 2023–24 విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక పట్టణ ప్రతినిధి బుద్ధ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా నేటికీ బకాయిలను రిలీజ్ చేయలేదన్నారు. కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రుల దగ్గర వసూలు చేసి సంవత్సరం అవుతుందన్నారు. మే నెలలో సచివాలయ ఉద్యోగులు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఈకేవైసీ చేశారన్నారు. బకాయిలు తల్లిదండ్రులు అకౌంట్లో గాని కాలేజీ యాజమాన్యం అకౌంట్లో గాని పడలేదన్నారు. 2024–25 సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ కొంత మేరకు విడుదల చేసినప్పటికీ మిగిలిన ఫీజుల కోసం కాలేజీ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు.

నారుమడికి నీటి తడులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నారుమడి బెట్టకు గురికాకుండా నేలలో పదును చూసుకుని నీటి తడులు ఇవ్వాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. బెట్ట పరిస్థితులలో ఒక గ్రాము మల్టి కె లేదా 19:19:19ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో ఇనుము ధాతులోప సవరణకు 5 గ్రాముల అన్నభేది, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. వరి నారుమడిలో పొడతెగులు ఆశించే అవకాశముంది. హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చు. వరి నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల ల కార్బొఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలి. నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లయితే, పూత దశలో పచ్చిరొట్ట పైరును నేలలో కలియదున్నుకుని పొలాన్ని తయారు చేసుకోవాలి. ఆఖరి దమ్ములో ఎకారాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్ వేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. వరి నాటేటప్పుడు ఆకు చివర్లను తుంచి 20 ఇన్ టూ 15 సెం.మీ దూరంలో కుదురుకు 2–3 మొక్కల చొప్పున నాటుకోవాలి. ఖరీఫ్‌లో చ.మీ.కు 33 మొనలు ఉండేలా చూసుకోవాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తియ్యడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకూ అదుపు చేయవచ్చు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగిన వర్ష సూచన లేనందున నేలలో పదును చూసుకుని వెద వరికి నీటి సదుపాయం కలిపించాలి. చెరకులో మొజాయిక్ తెగులు ఆశించే పేను బంక పురుగుల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. 5 గ్రాములల మల్టికెను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరానికి 35 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, సిహెచ్.ఎస్.రామలక్ష్మి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని వినతి



పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, విద్యా సంస్థలు వద్ద ఉదయం, సాయంత్రం సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ డి.ఈశ్వరరావుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంస్థలు, ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద ఆకతాయిలు అసభ్యకరమైన మాటలతో అమ్మాయిలను వేధిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రిళ్లు మందుబాబులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కొల్లి చిన్న అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ కోసం పలు చట్టాలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

కశింకోట: బాలికలు రక్షణ కోసం పలు చట్టాలున్నాయని, వాటి పట్ల అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ పి. మనోజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'గుడ్–బ్యాడ్' టచ్‌లపై పోలీస్ శాఖ శక్తి బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కలిగించారు. శారీరక, మానసిక ఆరోగ్యం పరిరక్షణకు పిల్లల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థినులు శారీరక శోషణను గుర్తించే విధానం, సురక్షితంగా ఉండే మార్గాల గురించి వివరించారు. తల్లిదండ్రులు, పోలీసులు, పెద్దల పట్ల ఎలా మసలుకోవాలి, ఇతరులు కావాలని టచ్ అయితే ఎలా స్పందించాలో వివరించారు. విద్యార్థులు విద్య పట్ల దృష్టి సారించాలన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఆపద వస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఏఎస్‌ఐ రమణమ్మ, కానిస్టేబుల్ మహేష్, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు రోజుల్లో గ్రామ కమిటీలు నియమిస్తాం



పార్టీ ముఖ్యనేతలతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



గవరపాలెం సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భరత్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రెండు రోజుల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. ఆ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో అనకాపల్లి పట్టణ, మండల, కశింకోట మండల కమిటీలు ప్రకటిస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 మాసాల్లో సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం వల్ల ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నాయకులు పోరాటాలు చేస్తున్నారన్నారు. గ్రామ, పట్టణంలో బాబు షూ్యరిటీ–మోసం గ్యారంటీ అనే నినాదంతో ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. అంతకుముందు గవరపాలెం సత్తెమ్మతల్లి ఆలయ 34వ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



సత్తిబాబు (ఫైల్)

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. గ్రామ సమీపంలోని పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో దాని డ్రైవర్ కన్నంరెడ్డి సత్తిబాబు (39) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు అందినట్లు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మృతునికి భార్య మోహిని, పాప, బాబు ఉన్నారు.

కౌలు వేలం వాయిదా

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములను కౌలుకు ఇవ్వడం కోసం మంగళవారం నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. ఆలయ ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఆలయానికి సంబంధించి వెదురుపర్తి, కాశీపాలెం (అచ్యుతాపురం మండలం) గ్రామాల్లో భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట ఏర్పాటు చేశారు. అయితే రైతులు ఎక్కువ మంది రాకపోవడంతో వాయిదా వేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు కమిటీల కృషి

- జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సూర్యలక్ష్మి

కశింకోట: బాలల హక్కుల పరిరక్షణకు, వారిని బాధ్యతాయుతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి గ్రామస్థాయి బాలల సంక్షేమ రక్షణ కమిటీలు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ఎస్. సూర్యలక్ష్మి కోరారు. మంగళవారం కశింకోట పంచాయతీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తరపున అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పిల్లల హక్కుల కోసం, చట్టాలు అమలు, వారిని బాధ్యులుగా తయారు చేయడానికి 11 మందితో బాలల రక్షణ సంక్షేమ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ బాల బాలికలకు సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు లేకుండా చూడటం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బడి బయట పిల్లలను గుర్తించడం, బాలలతో భిక్షాటన నివారించడం, వీధి బాలలను గుర్తించడం, బాలలు మత్తుకు బానిస కాకుండా చూడటం, పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడం వంటి సమస్యలను లేకుండా కమిటీ చూడాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డను మురుగు కాలువలో పారవేయడంతో మృతి చెందిన సంఘటనలు పునరావృతం కాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నతనంలో గర్భధారణను అరికట్టాలన్నారు. జిల్లా బాలల రక్షణ అధికారి కె.ఎల్. మనోహరరావు పిల్లల దత్తత తీసుకునే విధానం గురించి వివరించారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఏఎస్‌ఐ కె. రమణమ్మ, ఉపాధ్యాయుడు ఎన్. రమణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, బాలల రక్షణ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం హైస్కూలులో మాక్ పోలింగ్



ఓటు వేయడం కోసం ఆసక్తిగా లైన్‌లో ఉన్న విద్యార్థులు



తాళ్లపాలెం హైస్కూలులో నిర్వహిస్తున్న ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ



ఓట్ల కౌంటింగ్ నిర్వహణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో మాక్ పోలింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణ పట్ల అవగాహన కలిగించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు వేశారు. హెచ్‌ఎం ఎస్. ప్రసాదరావు పర్యవేక్షణలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు, బ్యాలెట్ ఓటింగ్ విధానం, లెక్కింపు కార్యక్రమం, విజేతల ప్రకటన తదితర అంశాలను ప్రత్యక్షంగా నిర్వహించి విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకురాలి (ఎస్పీఎల్)గా పులిగా జయలక్ష్మి, రెండో ఎస్పీఎల్‌గా రెడ్డి యశ్వంత్ ఓటింగ్ ద్వారా విద్యార్థులు ఎన్నుకున్నారు. వీరిని విద్యా కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, పాలక వర్గం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పాత పద్ధతిలోనే దమ్ములు

మాడుగుల : గత 20 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతంలో రైతులందరూ కాడెడ్లుతో దుక్కులతో పాటు దమ్ములు చేసేవారు. ఆ తర్వాత రైతులందరూ యంత్రాలపై ఆధారపడేవారు. మండలంలో వొమ్మలి, జేడీపేట, ఎం. కోడూరు, శంకరం, తాటిపర్తి, తదితర గ్రామాల్లో 50 శాతం మంది రైతులు పశువులతో దమ్ములు చేస్తున్నారు. ఇలా దమ్ము చేయడం వల్ల దిగుబడులు బాగా వస్తాయని, రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు అనుకున్నంత లేకపోవడంతో వ్యవసాయ మోటారులతో దమ్ములు చేస్తున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

చోడవరం : విద్యుత్ స్మార్ట్ మీటర్లను వినియోగదారులంతా వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. వెంకన్నపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. పారిశ్రామిక వ్యక్తుల చేతుల్లో ప్రజలను జీవితాలను నాశనం చేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రజలపై బలవంతంగా మోపుతున్నారని సీపీఎం జిల్లా ప్రతినిధి ఎ. శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు వారి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రజల గృహాలకు విధిగా వేసుకోవాలని నిబంధనలు విధించడం వారి ద్వంద వైఖరికి అద్దం పడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని పాదయాత్రలో లోకేష్ చెప్పి ఇప్పుడు ఏడాది తిరగకుండానే కరెంటు చార్జీలు భారీగా పెంచి ప్రజలను మోసం చేశారని శ్రీనివాసరావు అన్నారు. ఆదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించడం వల్ల ప్రతి వినియోగదారుడి వివరాలన్నీ ఆదానీ చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు.

అందుకే ఎవరూ స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని కోరుతూ ప్రచార పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఎస్.వి. నాయుడు పాల్గొన్నారు.